




జనంతో కిటకిటలాడుతున్న ప్రధాన రహదారి

రద్దీగా ప్రధాన రహదారి

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

సంక్రాంతి పండగను పురస్కరించుకొని సరుకుల కొనుగోలుకు జనం తరలిరావడంతో సోమవారం పట్టణ ప్రధాన రహదారి కిటకిటలాడింది. పట్టణంలో ఉన్న రైల్వేస్టేషన్, ఆర్‌టిసి కాంప్లెక్స్ రద్దీగా కనిపించాయి. పండగకు కావలసిన కొత్త బట్టలు, కిరాణా సామాన్లు, అలంకరణ సామగ్రి కొనుగోలు చేశారు. దీంతో ఆయా దుకాణ సముదాయాలు కిటకిటలాడాయి.

సంక్రాంతి వచ్చిందే తుమ్మెద



- ఆర్థిక ఇబ్బందుల నడుమ పెద్దపండగ
- అప్పుచేసి పిండివంటకాలు
- పల్లెకు చేరిన వలసజీవులు, ఉద్యోగ, వ్యాపారులు
- కనుమరుగవుతున్న నాటి సంస్కృతి, సంప్రదాయాలు

సంక్రాంతి వచ్చిందే తుమ్మెద... సరదాలు తెచ్చిందే తుమ్మెద... కొత్త ధాన్యాలతో... కోడి పందేలతో... ఊరేగిపొంగుతుంటే... అంటూ సరదాల సంక్రాంతిని వర్ణించాడో కవి. అందుకు తగ్గట్టే నేటి సంక్రాంతి వేళ పల్లెలన్నీ ముస్తాబవుతున్నాయి. సంక్రాంతి అనగానే పల్లెటూరి వాతావరణం కళ్ల ముందు కదలాడుతోంది. మట్టికి, మనిషికి ఉన్న అన్యోన్య బంధాన్ని గుర్తు చేస్తుంది. అందుకు తగ్గట్టే జనం పుట్టిపెరిగిన ఊళ్లకు పరుగు పరుగున చేరుకుంటున్నారు. కానీ, పెరిగిన నిత్యవసర సరుకుల ధరలు, పెరగని వేతనాలు, గిట్టుబాటుకు నోచుకోని వ్యవసాయ ఉత్పత్తుల ధరల వల్ల ఆర్థిక ఇబ్బందుల నడుమ సక్రాంతి పండగ జరుపుకోవాల్సివస్తోందంటూ జనం పెదవి విరిస్తున్నారు. అయినాసరే...! సంక్రాంతిపూట ఇంటిల్లపాదీ సరదాగా గడిపేందుకు వచ్చిన జనంతో పల్లెసీమలు కళకళాడుతున్నాయి.

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

సంక్రాంతికి నెలరోజుల ముందే.... అంటే నెలగంటు పెట్టినప్పటి నుంచీ రోజూ క్రమం తప్పకుండా ఇళ్ల అలుక్కోవడం (శుభ్రం చేసుకోవడం), సున్నాలు వేసి ప్రత్యేకంగా ముస్తాబు చేయడం వంటి పనులు ప్రారంభిస్తారు. రకరకాల పూలు, రంగులతో ఇళ్ల ముందు వేసిన ముగ్గులు హరివిల్లును తలపించేవి. గొబ్బెమ్మలు పెడుతూ యువతంతా ఆటపాటలతో అలికిరి చేసేవారు. బుడబుక్కలవాళ్లు, హరిదాసులు, కొమ్మ దాసులు, జంగం దేవర్లు.... కళలను ప్రదర్శించేవారు. పండగకు కొద్దిరోజుల ముందు నుంచే పిండి వంటకాలు ఘుమఘుమలాడేవి. కొత్తబట్టలు, కిరాణా సామగ్రి తదితర సరుకుల క్రయ విక్రయాలతో గ్రామీణ ఆర్థిక వ్యవస్థ కళకళలాడేది. బట్టల వ్యాపారులు సైకిళ్లపై గ్రామాల్లో తిరిగి విక్రయించేవారు. ఇలా గ్రామసీమలు కళకళలాడేవి. ఇదంతా ఒకప్పటి మాట. ప్రస్తుతం ఆ పరిస్థితి కనిపించడం లేదు. మారుతున్న పరిస్థితులు నాటి సంస్కృతి సంప్రదాయాలను కనుమరుగు చేస్తున్నాయి. ఏటా పండగ తీరు మారుతుండడమే ఇందుకు నిదర్శనం.

ప్రస్తుతం సంక్రాంతి అంటే కేవలం కొత్తబట్టలు, నగలు, సెల్‌ఫోన్లు వంటి వివిధ రకాల వస్తువులు కొనుక్కునే పండగ్గా మారిపోయింది. మరో మాటలో చెప్పాలంటే నాటి సంస్కృతి, సంప్రదాయాలు కనుమరుగవుతున్నాయి. గతంలో పల్లెటూళ్లలోనే ఇంటిల్లపాదీ కూర్చొని తీరిగ్గా తీసే బట్టలు నేడు పట్టణాల్లో షాపింగ్‌మాల్స్‌కు పరిమిత మవుతున్నారు. గ్లోబలైజేషన్ ప్రభావంతో అందరూ 'సెల్'కు బంధీలవుతున్నారు. భోగీ మంటల్లో కాల్చే పిడకల నుంచి ఆరగించే అరిసెల వరకు ఆన్‌లైన్‌లో ఆర్డర్ చేసే స్థాయికి పడిపోయాం. ప్రకృతితో మమేకమయ్యే పరిస్థితిని చేజేతులా కోల్పోతున్నాం. ఆలింగనం, కరచాలనం, ఆత్మీయ పలకరింపు కూడా ఉండడం లేదు. ఎవరికి వారే యమునా తీరే అన్న చందంగా తయారైంది.

పండగలు... ఉత్సవాలు... జాతరలు... మానవ సంస్కృతిలో భాగం. కొన్ని పండగలు ఉత్పత్తితో ముడిపడి ఉంటాయి. మరికొన్ని ప్రకృతిపై మానవుడు సాధించిన విజయాలకు చిహ్నంగా నిలుస్తాయి. ఇంకొన్ని పూర్తిగా కుల, మత నమ్మకాలపై ఆధారపడి ఉంటాయి. ఇందులో మొదటి కోవకు చెందిందే సంక్రాంతి పండగ. జిల్లాలోని 80శాతం కుటుంబాలు వ్యవసాయంతో ప్రత్యక్షంగానో, పరోక్షంగానో ముడిపడి ఉన్నవే. ఈ ఏడాది మునుపెన్నడూ లేనంతగా వరిసాగైనప్పటికీ, పెరిగిన విత్తన, పురుగు మందులు, ఎరువుల ధరలకు తగ్గట్టుగా ధాన్యం ధరను పెంచలేదు. దీనికితోడు నవంబరులో కురిసిన వర్షాలు పెట్టుబడిని మరికొంత పెంచేశాయి. ఇంకొందరికి ఏకంగా నష్టం చేకూరింది. దీంతో, రైతు కుటుంబాలన్నీ తీవ్ర నష్టాలను చవిచూశాయి. ఫలితంగా వ్యవసాయంపై ఆధారపడిన వ్యవసాయ కార్మికులకు, వృత్తిదారులకు ఆశించిన ఉపాధి దొరకలేదు. ధాన్యం, పత్తి కొనుగోలు కేంద్రాలు మొక్కుబడిగానే ఏర్పాటు చేశారు. దళారుల రంగ ప్రవేశంతో ప్రభుత్వం పెంచిన అరకొర ధర కూడా అమలు కాని దుస్థితి దాపురించింది. దీంతో, తీవ్ర రైతులు ఆవేదన చెందుతున్నారు. గత వైసిపి ప్రభుత్వంలో పండగ ముందు కొన్ని నగదు బదిలీ పథకాల డబ్బులు ప్రజల ఖాతాల్లో జమ అయ్యేవి. అంతకు ముందు చంద్రన్న కానుక పేరిట నూనె, నెయ్యి, కందిపప్పు, పంచదార, బెల్లం తదితర ఏడు రకాల సరుకులు ఇచ్చేవారు. ఫలితంగా పండగలో కాస్తంత ఉపసమనం ఉండేది. ఈసారి అటువంటివేవీ లేకపోవడంతో ఆర్థిక ఇబ్బందుల నడుమ సంక్రాంతి సంబరాలు చేసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. జిల్లాలో సుమారు 500లకు పైగా అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటిలో పనిచేసే కార్యకర్తలు, హెల్పర్లు, మినీ అంగన్‌వాడీలకు ఈనెల 2 లేదా 3వ తేదీల్లో అందాల్సిన వేతనాలు ఇప్పటికీ పడలేదు. దీంతో, తామంతా పండగంటి పూట పప్పన్నం తినలేని పరిస్థితి ఎదురైందని వాపోతున్నారు.

కనుమరుగవుతున్న మానవ సంబంధాలు

మరోవైపు పండగలో ప్రజాసంస్కృతికి బదులు కార్పొరేట్ సంస్కృతి వచ్చేసింది. సాంకేతిక పరిజ్ఞానం పెరుగుతున్న కొద్దీ మానవ సంబంధాలు కనుమరుగువుతున్నాయి. గతంలో వారం రోజులు ముందుగానే సొంత ఊళ్లకు వెళ్లేవారు. నేడు ఆ పరిస్థితి లేదు. పని ఒత్తిడి, ఉద్యోగులకు సెలవులు దొరక్కపోవడం, విద్యార్థులకు స్పెషల్ కోచింగ్ వంటి కారణాల వల్ల చివరి క్షణాల్లో తప్పక వెళ్తున్నారు. కొద్దిమందికి అది కూడా సాధ్యం కాక పండక్కి దూరమౌతున్నారు.



గంగిరెద్దుతో విన్యాసాలు చేయిస్తున్న వ్యక్తి

వికలాంగుల్లో సర్వే దిగులు

అనర్హుల ఏరివేతపై వైద్యుల పరిశీలన ● లక్ష్యం.. రూ.6 వేల పింఛను లబ్ధిదారులు

ప్రజాశక్తి-పార్వతీపురం

రాష్ట్రంలోని వికలాంగుల పింఛన్లలో అనర్హుల ఏరివేతపై ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. దీనిలో భాగంగా వైద్యుల బృందంతో వికలాంగ పింఛను లబ్ధిదారుల అర్హత పరిశీలనకు ఆదేశించింది. ఇప్పటికే వైద్యులు ఈ రకమైన పింఛను తీసుకుంటున్న లబ్దిదారుల నివాసాలకు వెళ్లి వారి అంగవైకల్యాన్ని ప్రత్యక్షంగా పరిశీలిస్తున్నారు. పూర్తి అంగవైకల్యం, కదల్లేని పరిస్థితిలో దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారి ఇళ్లకు వెళ్లి రూ.15 వేల పింఛను పొందడానికి అర్హులా? కాదా? అనే అంశంపై సర్వే నిర్వహిస్తున్నారు.



పింఛనుదారులు

పార్వతీపురం మన్యం జిల్లాలో రూ.15 వేల పింఛను తీసుకుంటున్న లబ్ధిదారులు 87 మంది ఉన్నారు. 6 వేల రూపాయల పింఛను తీసుకుంటున్న లబ్ధిదారులు 16వేల మంది ఉన్నారు. రూ.15 వేల పింఛను తీసుకుంటున్న లబ్ధిదారులలో చాలా వరకు నిబంధనలకు అనుగుణంగానే ఉన్నట్లు తెలుస్తోంది. అయితే రూ.6 వేల పింఛను తీసుకుంటున్న లబ్ధిదారుల్లో చాలా వరకు బోగస్ ధ్రువపత్రాలతో పొందుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. తప్పుడు సదరం ధ్రువపత్రాలతో ఆరు వేల రూపాయల వికలాంగుల పింఛను పొందుతున్నారనే ఫిర్యాదులు ఇప్పటికే అందాయి. వైద్యులిచ్చిన అంగవైకల్య శాతానికి అనుగుణంగా వారి వైకల్యం ఉందా? లేదా? అన్నది పరిశీలించిన తర్వాత ప్రభుత్వానికి నివేదిక సమర్పించే అవకాశం ఉంది. దీంతో రూ.6 వేలు చొప్పున వికలాంగ పింఛను పొందుతున్న వారిలో ఆందోళన మొదలైంది. లబ్ధిదారులను పిలిపించి వారి అర్హతలను పరిశీలించేందుకు రంగం సిద్ధమైంది. జిల్లాలోని అన్ని మండలాల్లో ఈ తరహా పింఛను లబ్ధిదారులపై వైద్యులు నిశితంగా పరిశీలిస్తే చాలావరకు అనర్హత వేటుకు గురయ్యే అవకాశాలు మెండుగా ఉన్నాయి. వైద్యులు ఏ మేరకు వికలాంగుల పింఛన్లలో అనర్హుల ఏరివేతపై సర్వే నివేదిక అందజేస్తారనేది వేచిచూడాల్సిందే.

ఆనందోత్సాహాలతో భోగి

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

భోగి పండుగను సోమవారం జిల్లా వ్యాప్తంగా ఆనందోత్సాహాలతో నిర్వహించారు. వేకువ జామున ముందుగానే లేచి సేకరించిన దుంగలను కుప్పలుగా పోసి భోగి మంటలు వెలిగించారు. నర్సిపురంలో ఎమ్మెల్యే బోనెల విజయ్‌చంద్ర ఇంటి వద్ద ఎమ్మెల్యేతోపాటు కార్యకర్తలు, నాయకులు పెద్ద ఎత్తున హాజరై భోగి మంటలు వేశారు.

గుమ్మలక్ష్మీపురం : గుమ్మలక్ష్మీపురం, జియ్యమ్మవలస మండలాల్లో ప్రజలు భోగి పండుగను సోమవారం ఆనందోత్సవాల నడుమ జరుపుకున్నారు. పిల్లల నుంచి పెద్దల వరకు అందరూ కలిసి భోగి మంటలు వేశారు. ఈ పండుగ వేళ సకల సౌభాగ్యాలు కలగాలని వేడుకున్నారు.

కురుపాం : మండలంలో భోగి పండగను ప్రజలు ఆనందంతో జరుపుకున్నారు. ప్రతి వీధిలో తెల్లవారుజామునే భోగి మంటలు వేశారు. ఇంటి ముంగిట రకరకాల సంక్రాంతి ముగ్గులు వేసి గొబ్బెమ్మలు పెట్టి, గుమ్మడి పువ్వులు, గరిక పూసలతో అలంకరించారు. భోగి మంటల వద్ద పెద్దలు, పిల్లలు సందడి చేశారు.



భోగి వేడుకల్లో పాల్గొన్న పార్వతీపురం ఎమ్మెల్యే విజయ్‌చంద్ర

భోగిమంటల్లో విద్యుత్తు బిల్లులు దహనం

జిల్లా వ్యాప్తంగా సిపిఎం నిరసనలు

ప్రజాశక్తి-పార్వతీపురం

పెంచిన విద్యుత్తు ఛార్జీలు తగ్గించాలని సిపిఎం ఆధ్వర్యాన జిల్లా వ్యాప్తంగా సోమవారం నిరసనలు చేపట్టారు. భోగిమంటల్లో విద్యుత్తు బిల్లులు దహనం చేసి నిరసనలు తెలిపారు. పార్వతీపురం పట్టణంలోని 14వ వార్డు గొల్లవీధిలో సిపిఎం ఆధ్వర్యాన భోగి మంటల్లో విద్యుత్తు బిల్లులను దహనం చేశారు. ఈ సందర్భంగా సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు రెడ్డి వేణు మాట్లాడుతూ టిడిపి కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు వైసిపి ప్రభుత్వం కరెంట్ ఛార్జీలు పెంచిందని, తాము అధికారంలోకి వస్తే వాటిని తగ్గిస్తామని చెప్పి, నేడు మాట తప్పిందని విమర్శించారు. అదానీ స్మార్ట్ మీటర్లు పగల గొట్టాలని ప్రతిపక్షంలో ఉన్నప్పుడు టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు, జాతీయ ప్రధానకార్యదర్శి నారా లోకేష్ పిలుపునిచ్చారని గుర్తుచేశారు. ఇప్పుడు అధికారంలోకి వచ్చిన తర్వాత జగన్ చేసిన పనినే కూటమి ప్రభుత్వం కొనసాగిస్తోందని ధ్వజమెత్తారు. ట్రూఅప్ ఛార్జీల భారాన్ని తగ్గించాలని, స్మార్ట్‌మీటర్లను రద్దు చేయాలని డిమాండ్‌చేశారు. లేకుంటే ప్రజలతో కలిసి పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సిపిఎం, ఐద్వా, పిపిఎస్‌ఎస్ నాయకులు బర్ల లక్ష్మి, ఆవాల గంగమ్మ, పల్ల రవణమ్మ, పల్ల లక్ష్మి, కొంద్రు గీత, పొట్లూరు లక్ష్మి, జాడ పద్మ, దుర్గమ్మ ఆధ్వర్యాన భోగి మంటల్లో బిల్లులను దహనం చేశారు. ఈ కార్యక్రమాల్లో సిపిఎం పట్టణ కార్యదర్శి గొర్లి వెంకటరమణ, నాయకులు బి.సూరిబాబు, పి.రాజశేఖర్, శంకర్రావు, సింహాచలం, సంతోష్, అప్పలనాయుడు, నవీన్, చందు, రాజు తదితరులు పాల్గొన్నారు.



మక్కువ మండలం తూరుమామిడిలో భోగి మంటలో విద్యుత్తు బిల్లులు వేసి దహనం చేస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి కె.గంగునాయుడు, గ్రామస్తులు

మక్కువ : మండలంలోని తూరుమామిడి గ్రామంలో సిపిఎం జిల్లా కార్యదర్శి కె.గంగునాయుడు ఆధ్వర్యంలో భోగి మంటల్లో విద్యుత్తు బిల్లులను వేసి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా గంగునాయుడు మాట్లాడుతూ విద్యుత్తు ఛార్జీలపై ఎన్నికల ముందు వైసిపి ప్రభుత్వంపై కూటమి నాయకులు విమర్శలు గుప్పించి, తాము అధికారంలోకి వస్తే కరెంట్ ఛార్జీలు తగ్గిస్తామని హామీనిచ్చారని గుర్తుచేశారు. గత జగన్ ప్రభుత్వం పెడుతున్న అదానీ స్మార్ట్ మీటర్లు పగలగొట్టాలని అప్పటి ప్రతిపక్ష నేత చంద్రబాబు, నారా లోకేష్ పిలుపునిచ్చారని గుర్తుచేశారు. తీరా టిడిపి కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత జగన్ చేసిన పనినే కొనసాగిస్తోందని విమర్శించారు. స్మార్ట్ మీటర్లు పెట్టిన తరువాత సెల్‌ఫోన్ రీఛార్జి చేసినట్లు చేసుకోవాలని, లేక పోతే ఏ రాత్రి కరెంట్ పోతుందో తెలియదని చెప్పారు. ఇంత దుర్మార్గమైన విధానాన్ని కూటమి ప్రభుత్వం ప్రజల నెత్తిన పెడుతోందని ఆగ్రహం వ్యక్తంచేశారు. దీన్ని ప్రజలంతా కలిసి ఎదుర్కోవాలని, పోరాడాలని పిలుపునిచ్చారు. లేకుంటే రానున్న రోజుల్లో ప్రజల ఆదాయంలో సగం కరెంట్ ఛార్జీలకే పోతుందని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం కరెంట్ ఛార్జీలు తగ్గించి, స్మార్ట్ మీటర్లు వెనక్కి తీసుకోకపోతే ప్రజలతో కలిసి పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు

సాలూరు రూరల్ : పట్టణంలోని మెయిన్‌రోడ్డు, నెయ్యిలవీధి, గాంధీనగర్, బంగారమ్మకాలనీల్లో సిపిఎం ఆధ్వర్యాన భోగి మంటల్లో కరెంటు బిల్లులను దహనం చేశారు. అనంతరం సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎన్‌వై నాయుడు మాట్లాడుతూ వైసిపి హయాంలో విద్యుత్తు ఛార్జీలు పెంచితే, బాదుడే బాదుడు అంటూ టిడిపి నాయకులు గగ్గోలు పెట్టారని, తీరా అధికారంలోకి వచ్చాక చేసిందేమిటని నిలదీశారు. టిడిపి కూటమి అధికారంలోకి వచ్చిన ఆరు నెలల కాలంలో రూ.6072 కోట్లు విద్యుత్తు భారాలు ప్రజలపై వేసిందని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం, ప్రజా సంఘాల నాయకులు ఎం.శ్రీను, రాముడు, వెంకట్రావు, రవి, ఈశ్వరరావు పాల్గొన్నారు.

సీతానగరం : టిడిపి కూటమి ప్రభుత్వం పెంచిన ఛార్జీలు తగ్గించాలని, స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలని మండలంలో పలుచోట్ల సిపిఎం ఆధ్వర్యాన నిరసనలు చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు రెడ్డి వేణు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి గవర వెంకటరమణ, నాయకులు రాయిపల్లి రాము, చందనపల్లి కృష్ణ, కె.లక్ష్మణరావు, బి.సింహాచలం, పలగల శ్రీను, సొంగల శంకరరావు, కస్తూరి పార్వతి, ఎం.అప్పమ్మ, వాడాడ అప్పన్న పాల్గొన్నారు.

పాలకొండ : స్థానిక తహశీల్దార్ కార్యాలయ ఆవరణలో సిపిఎం ఆధ్వర్యాన విద్యుత్తు బిల్లులు దహనం చేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా నాయకులు దావాల రమణారావు మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు పి.వేణు, పి.కృష్ణవేణి, డి.అమల, జి.గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

పాచిపెంట : మండలంలోని పద్మాపురం, పాచిపెంట, కుడుమూరు, మెట్టవలస వద్ద సిపిఎం ఆధ్వర్యాన భోగి మంటల్లో విద్యుత్తు బిల్లులు వేసి దహనం చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకులు కోరాడ ఈశ్వరరావు, మండల నాయకులు మంచాల శ్రీనివాసరావు, ఎస్.అప్పలస్వామి, గౌరు నాయుడు పాల్గొన్నారు.



పార్వతీపురంలో భోగి మంటలో విద్యుత్తు బిల్లులు వేసి దహనం చేస్తున్న సిపిఎం నాయకులు రెడ్డి వేణు, నాయకులు





సీతానగరం, సాలూరులో భోగి మంటల్లో విద్యుత్తు బిల్లులు వేసి నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు, కార్యకర్తలు

గిరిజన బాలిక ఆత్మహత్య

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

గిరిజన బాలిక ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటన మండలంలోని లోవముఠా ప్రాంతంలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గుమ్మలక్ష్మీపురం మండలం జర్న గ్రామానికి చెందిన జీలకర్ర స్వాతి (16) తన ఇంటిలో దూలానికి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. స్వాతిపై గతంలో బొబ్బిలిలో లైంగిక దాడి జరిగింది. ఈ విషయమై పార్వతీపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. లైంగిక దాడికి పాల్పడిన వ్యక్తిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. అయితే స్వాతి మనస్తాపంతో ఆత్మహత్యకు పాల్పడినట్లు అనుమానిస్తున్నారు. ఎల్విన్‌పేట ఎస్ఐ బిడ్డిక శివప్రసాద్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భద్రగిరి సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు.




ఆత్మహత్య చేసుకున్న స్వాతి

కార్మికుల సేవలు వెలకట్టలేనివి

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

ప్రజల ఆరోగ్యం కోసం మీ ఆరోగ్యాన్ని పణంగా పెట్టి ప్రతిరోజూ పారిశుద్య కార్మికులు చేస్తున్న సేవలు వెలకట్టలేనివని మున్సిపల్ వైస్ చైర్మన్ ఇండుపూరు గున్నేష్ అన్నారు. భోగి పండుగను పురస్కరించుకొని సోమవారం మున్సిపల్ కార్యాలయంలో ప్రజారోగ్య విభాగంలో విధులు నిర్వహిస్తున్న 138 మంది పర్మినెంట్, కాంట్రాక్టు పారిశుధ్య కార్మికులకు దుప్పట్లు, చీరలు పంపిణీ చేశారు. సిఐటియు జిల్లా కోశాధికారి గొర్లి వెంకటరమణ ఆధ్వర్యంలో గున్నేష్ సతీమణి ఉషారాణి, కుమారుడు వెంకటేష్, కోడలు సుష్మా, మనుమడు ఇషాంత్, మనుమరాలు సహస్రతో కలిపి అందజేశారు.



కార్మికులకు దుస్తులు పంపిణీ చేస్తున్న మున్సిపల్ వైస్ చైర్మన్ గున్నేష్ కుటుంబ సభ్యులు

అంతర్రాష్ట్ర వివాదాలపై అంతులేని నిర్లక్ష్యం


ఆంధ్రా-ఒడిశా సరిహద్దులోని కొఠియా గ్రామం

- కొటియా, జంఝావతి సమస్యలపై చిత్తశుద్ధి లేమి
- ఒడిశా, ఏపిలో ఎన్‌డిఎ ప్రభుత్వాలున్నా చొరవ చూపని ఎమ్మెల్యేలు, మంత్రులు

ప్రజాశక్తి-పార్వతీపురం

పార్వతీపురం మన్యం జిల్లాలో రెండు అంతర్రాష్ట్ర వివాదాలపై అంతులేని నిర్లక్ష్యం కొనసాగుతోంది. దశాబ్దాలు గడుస్తున్నా దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి పాలకులు చొరవ చూపించని పరిస్థితి కనిపిస్తోంది. ఫలితంగా రైతులు, గిరిజనులు తీవ్రంగా నష్టపోతున్నారు. ప్రభుత్వాలెన్ని మారినా ఈ వివాదాల పరిష్కారానికి కనీస చొరవ చూపడం లేదు. ఎన్నికల ముందు హామీలిస్తూ గెలిచిన తరువాత గాలికొదిలేయడం జిల్లా పాలకులకు అలవాటుగా మారింది.

జిల్లాలో సుదీర్ఘ కాలంగా కొటియా గ్రామాల వివాదం, జంఝావతి జలవివాదాలు పొరుగునున్న ఒడిశా ప్రభుత్వంతో ఉన్నాయి. ఏపి, ఒడిశా రాష్ట్రాల్లో ఎన్‌డిఎ కూటమి ప్రభుత్వాలున్నాయి. గతంలో వేర్వేరు ప్రభుత్వాలు ఉన్న కారణంగా పాలక పక్షాలు పట్టించుకున్న దాఖలాలు లేవు. కేంద్రంలో, ఒడిశా, ఏపిలో ఎన్‌డిఎ కూటమి ప్రభుత్వాలు ఏర్పడటంతో దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి అనుకూల పరిస్థితి ఏర్పడింది. ఈ రెండు వివాదాలు పరిష్కారమైతే మన్యం జిల్లాకు ఎక్కువ ప్రయోజనం చేకూరుతుంది. 21 గిరిశిఖర గ్రామాలకు సంబంధించిన కొటియా వివాదం ఆరు దశాబ్దాలుగా ఉంది. ఈ గ్రామాల్లో విలువైన ఖనిజ సంపద ఉండటంతో ఒడిశా ప్రభుత్వం ఆ గ్రామాలు తమవేనని వాదిస్తోంది. గత మూడు సంవత్సరాలుగా కయ్యానికి కాలు దువ్వుతోంది. కొటియా గ్రామాలపై పట్టు సాధించేందుకు శతవిధాలా ప్రయత్నిస్తోంది. అయితే రెండు, మూడు గ్రామాలు తప్ప మిగిలిన గ్రామాలన్నీ ఏపిలో ఉండేందుకు ఆసక్తి చూపుతున్నాయి. ఆంధ్రాలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు తమ జీవనోపాధికి మేలు చేస్తున్నాయని గిరిశిఖర గ్రామాల గిరిజనులు భావిస్తున్నారు. మూడేళ్ల క్రితం వరకు కొటియా గ్రామాలలో ఏపి, ఒడిశా సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేసేవి. అయితే గత మూడు సంవత్సరాలుగా ఆ గ్రామాలపై పెత్తనం చెలాయించేందుకు ఒడిశా ప్రభుత్వం ప్రయత్నిస్తుండటంతో గిరిజనులు నలిగిపోతున్న పరిస్థితి నెలకొంది. ఈ గ్రామాల్లో ఏపి ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ఒడిశా అధికారులు, ప్రజాప్రతినిధులు అడ్డుకునేందుకు ప్రయత్నించారు. ఒడిశా దూకుడుగా వ్యవహరిస్తున్నా ఏపి ప్రభుత్వం సన్నాయి నొక్కులు నొక్కుతూ వస్తోంది. సాలూరు నియోజకవర్గ ఎమ్మెల్యేగా ఎన్నికైన సంధ్యారాణి ఇప్పుడు గిరిజన సంక్షేమ శాఖ మంత్రిగా వ్యవహరిస్తున్నారు. టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడు నెలలు అయింది. అయినా ఈ సమస్య పరిష్కారానికి చొరవ చూపుతున్న దాఖలాలు లేవు. ఎన్నికల ముందు మంత్రి సంధ్యారాణి కొటియా గ్రామాల వివాదంపై హామీ ఇచ్చారు. కానీ ఆ దిశగా ప్రయత్నం చేయడం లేదు.

నాలుగున్నర దశాబ్దాలుగా జంఝావతిపై నిర్లక్ష్యం

జిల్లాలో అతి ముఖ్యమైన సాగునీటి ప్రాజెక్టు జంఝావతి. గత 45 సంవత్సరాలుగా ఈ ప్రాజెక్టు కార్యరూపం దాల్చకపోలడం వెనుక పాలకుల నిర్లక్ష్యమే ప్రధాన కారణమని చెప్పొచ్చు. ఎమ్మెల్యేలెందరు మారినా ఈ ప్రాంత రైతుల కల సాకారం కావడం లేదు. ఎన్నికల హామీగానే మిగులుతోంది. ఒడిశాతో ఉన్న జలవివాదం ఈ ప్రాజెక్టు నిర్మాణానికి అడ్డంకిగా ఉంది. ఇప్పుడు ఒడిశా, ఏపిలో ఎన్‌డిఎ ప్రభుత్వాలు అధికారంలో వున్నాయి. ఇరు రాష్ట్రాల ఇరిగేషన్ మంత్రులు, నియోజకవర్గ ఎమ్మెల్యేలు చర్చలు జరిపితే ఈ సమస్యకు పరిష్కారం దొరుకుతుంది. గత ప్రభుత్వ హయాంలో అప్పటి సిఎం జగన్, ఒడిశా సిఎం నవీన్ పట్నాయక్‌తో భువనేశ్వర్‌లో చర్చలు జరిపారు. ఆ చర్చల్లో జంఝావతి, కొటియా గ్రామాల వివాదాలపై చర్చించారనే ప్రచారం అప్పట్లో జరిగింది. అయితే ఆ చర్చల సారాంశం బయటకు రాలేదు. వేలాది మంది రైతులకు సంబంధించిన జంఝావతి ప్రాజెక్టు నిర్మాణాన్ని కేవలం ఒడిశాతో వివాదాన్ని సాకుగా చూపి స్థానిక పాలకులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. దీనిపై ఎన్నో ఏళ్లుగా సిపిఎం, ఏపి రైతుసంఘం పోరాడుతున్నాయి. ఇటీవల కాలంలో ఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణ సమితి ఆధ్వర్యాన రైతు, ప్రజాసంఘాల నాయకులు జంఝావతి ప్రాజెక్టు నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేస్తూ నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఈ ప్రాజెక్టు పరిధిలోని గ్రామాల్లో పర్యటించి స్థానిక సర్పంచుల తీర్మానాలతో రాష్ట్ర ప్రభుత్వానికి నివేదికలు అందజేశారు. ఇంత జరుగుతున్నా జిల్లాకి చెందిన మంత్రి గాని, ఎమ్మెల్యేలు గాని నోరు మెదపడం లేదు. ఈ రెండు అంతర్రాష్ట్ర వివాదాలపై అంతులేని నిర్లక్ష్యంతో గిరిజనులు, రైతులను పాలక పార్టీలు మోసం చేస్తున్నాయి.

జంఝావతికి జలహారతి


జలహారతి కార్యక్రమంలో పాల్గొన్న ఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణ సమితి ప్రతినిధులు

కొమరాడ : జంఝావతికి జలహారతి కార్యక్రమాన్ని ఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణ సమితి ప్రతినిధులు సోమవారం నిర్వహించారు. సమితి వ్యవస్థాపక అధ్యక్షులు మరిశర్ల మాలతి కృష్ణమూర్తి నాయుడు ఆధ్వర్యంలో జంఝావతి రబ్బరు డ్యామ్ వద్ద జలాశయ శిలాఫలకానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఐదు దశాబ్దాలుగా ఉత్సవ విగ్రహంలా పడి ఉన్న శిలాఫలకం వద్ద నిరసన తెలియజేశారు. అనంతరం రబ్బర్‌డ్యామ్ వద్ద జంఝావతి నదిలో పువ్వులు, పసుపు, కుంకుమ, కర్పూరంతో జల హారతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జంఝావతి ప్రాజెక్టు పూర్తిస్థాయిలో పనులు చేపట్టాలని ఆయకట్టు గ్రామాల్లో కన్నీటియాత్ర, బైక్ ర్యాలీ తదితర కార్యక్రమాలను నిర్వహించామన్నారు. అందులో వచ్చిన అర్జీలను ఆయా శాఖల మంత్రులకు సమర్పించామని తెలిపారు. ప్రాజెక్టు పూర్తయ్యేవరకు ఉద్యమం కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో సమితి జిల్లా అధ్యక్షులు వంగల దాలినాయుడు, సలహాదారు వర్రి శివకృష్ణ, ప్రతినిధులు తుంబలి శివాజీ, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే సన్మానిస్తున్న గ్రామస్తులు

యువతకు ఆదర్శం.. స్వామి వివేకానంద

ఎమ్మెల్యే విజయ్ చంద్ర

ప్రజాశక్తి-సీతానగరం

యువతకు స్వామి వివేకానంద ఆదర్శమని ఎమ్మెల్యే బోనెల విజయ్‌చంద్ర తెలిపారు. మండలంలోని గెడ్డలుప్పి గ్రామంలో స్వామి వివేకానంద జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశ కీర్తి ప్రతిష్టలను విశ్వవ్యాప్తంగా ఇనుమడింపజేసిన మహోన్నత వ్యక్తి స్వామి వివేకానంద అన్నారు. ఆయన ఆశయ స్ఫూర్తితో అభివృద్ధిలో యువత చురుకైన పాత్ర పోషించాలని కోరారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఎమ్మెల్యేను సన్మానించారు. ఈ కార్యక్రమంలో టిడిపి, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


వాహన తనిఖీలు చేపడుతున్న పోలీసులు

హెల్మెట్ తప్పనిసరి

ప్రజాశక్తి-సీతానగరం

వాహనదారులు హెల్మెట్‌ను తప్పక ధరించాలని ఎస్ఐ ఎం.రాజేష్ సూచించారు. సోమవారం మండలంలోని హనుమాన్ జంక్షన్ వద్ద వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెల్మెట్ ధరించాలని, మద్యం సేవించి వాహనాలు నడపరాదని కోరారు. కార్యక్రమంలో ఎఎస్ఐ లంక శ్రీనివాసరావు, పోలీస్ సిబ్బంది తిరుపతిరావు, సంపత్ కుమార్, నాయుడు, పద్మ తదితరులు పాల్గొన్నారు.

జూనియర్ సైంటిస్ట్‌గా కిరణ్

బాబా ఆటమిక్ రీసెర్చ్ సెంటర్లో ఉద్యోగానికి ఎంపిక

ప్రజాశక్తి- నెల్లిమర్ల

మండలంలోని సీతారామునిపేట గ్రామానికి చెందిన యువకుడు అరసవిల్లి కిరణ్ కుమార్ అరుదైన ఘనత సాధించారు. ముంబైలోని భారత్ అణు పరిశోధన కేంద్రం తాజాగా నిర్వహించిన ఉద్యోగ పోటీ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచారు. సదరు సంస్థలో జూనియర్ సైంటిస్ట్‌గా ఎంపికయ్యారు. తాజాగా నిర్వహించిన రాత పరీక్షలో ఆలిండియాలో 12వ ర్యాంక్ సాధించారు. సదరు ఉద్యోగ ఇంటర్వ్యూలో 48వ ర్యాంకు సాధించి హైదరాబాద్‌లోని న్యూక్లియర్ ఫ్యూయల్ కాంప్లెక్స్‌లో గ్రూపు బి గెజిటెడ్ అధికారిగా ఉద్యోగం సాధించారు. కిరణ్ కుమార్ తండ్రి అరసవల్లి రామకృష్ణ నెల్లిమర్ల మిమ్స్ వైద్య కళాశాలలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నారు. తల్లి పద్మ గృహిణి. కిరణ్ కుమార్ ఒకటో తరగతి నుంచి పదోతరగతి వరకూ నెల్లిమర్ల శ్రీఆదిత్య పబ్లిక్ స్కూల్లో చదివారు. విశాఖపట్నం జిల్లా కొమ్మాదిలోని శ్రీ చైతన్య కళాశాలలో పాలిటెక్నిక్ విద్యనభ్యసించారు. డెంకాడ మండలం లెండి ఇంజనీరింగ్ కళాశాలలో బిటెక్ పూర్తి చేశారు. ఆయన అణు పరీక్ష కేంద్రంలో ఉద్యోగం సాధించడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


ట్రాఫిక్ నియంత్రిస్తున్న పోలీస్ సిబ్బంది

ట్రాఫిక్ క్రమబద్ధీకరణ

ప్రజాశక్తి-మక్కువ

మండల కేంద్రంలో సోమవారం భోగి పండుగ నేపథ్యంలో బజారు మెయిన్ రోడ్డు కూడలిలో ఎఎస్ఐ శ్రీనివాసరావు సిబ్బందితో కలిసి ట్రాఫిక్ నియంత్రణ చేపట్టారు. కార్యక్రమంలో హెచ్‌సి రాజేష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఘనంగా అంబేద్కర్ విగ్రహావిష్కరణ

ప్రజాశక్తి- రాజాం

మండలంలోని గురువాం గ్రామంలో నిర్మించిన భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని సోమవారం ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ ఆవిష్కరించారు. అనంతరం విగ్రహానికి ఎమ్మెల్యే మండలంలోని దళిత నాయకులు, ప్రజా ప్రతినిధులతో కలిసి పూలదండలు వేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విగ్రహ ఆవిష్కరణ సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రపంచంలో యుద్ధాలతో సాధించలేనిది, కేవలం జ్ఞానంతో రాజ్యాంగాన్ని సాధించిన మొదటి వ్యక్తి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అని అన్నారు. అణచివేత, చిన్నచూపునకు గురైనా అంబేద్కర్ ప్రపంచ దేశాలకు వెళ్లి ఎవరూ సాధించలేని ఉన్నత చదువులు చదివి భారతదేశానికి వచ్చి రాజ్యాంగాన్ని రచించి అన్ని వర్గాల మన్ననలు పొందారన్నారు. మానవ సంబంధాలన్నీ ఆర్థిక సంబంధాలేనని, నిరంతరం జ్ఞానం కోసం శ్రమిస్తూ తాము తక్కువ కాదనే దృక్పదంలో ఉండాలన్నారు. ఏ వర్గమైనా అంబేద్కర్ జీవిత పాఠాన్ని ఆదర్శంగా తీసుకోవాలని, ఈ దేశంలో ప్రతి వారికి కావాల్సిన వ్యక్తి అంబేద్కర్ అని, ఒక వర్గం, కులానికి కాదని, అందరి కోసం రాజ్యాంగాన్ని రచించిన మహా మేధావని కొనియాడారు. అనంతరం రాజాం మాదిగవీధికి చెందిన ఓ చిన్నారి తీవ్ర అనారోగ్యానికి గురికావడంతో ఆసుపత్రి చికిత్స నిమిత్తం తన తండ్రి ఇలపండ అజయ్ కుమార్‌కు రూ.1,06,127 సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందజేసారు. సీఎం రిలీఫ్ ఫండ్ తో ఎంతో మంది పేదలకు సంజీవనిగా నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమాల్లో టిడిపి నాయకులు సుమల మన్మధరావు, గురువాన నారాయణరావు, పిన్నింటి మోహనరావు, దూబ ధర్మరావు, దుప్పలపూడి శ్రీను, లచ్చుబుక్త కృష్ణమూర్తి, పొన్నాడ భీమేశ్వరరావు, మజ్జి గణపతి, బవిరి శ్రీనుబాబు, యాగాటి రాము, జరజాన నీలయ్య, కేత శంకర్, బిల్లాన రమణ, జరజాన నితిన్, బిజెపి నాయకులు కోటగిరి నారాయణరావు, జనసేన నాయకులు యూపీ రాజు, గెడ్డపు నీలకంఠం, చిత్రరి నాగరాజు తదితరలు పాల్గొన్నారు.

కోడి పందేలు నిర్వహిస్తే చర్యలు

ప్రజాశక్తి-పాలకొండ

గ్రామాల్లో కోడి పందేలు నిర్వహిస్తే చర్యలు తప్పవని మండల ప్రత్యేక అధికారి మన్మథరావు హెచ్చరించారు. మండలంలో సోమవారం కొండాపురం, గోపాలపురం తదితర గ్రామాల్లో పర్యటించి, ప్రజలకు అవగాహన కల్పించారు. కోళ్ల, పొట్టేళ్ల పందేలు చట్టరీత్యా నేరమన్నారు. ఇందులో ఎవరు పాల్గొన్నా, వారు కూడా నేరస్తులు అవుతారన్నారు.

కుష్టు వ్యాధిగ్రస్తుల గుర్తింపునకు

20 నుంచి అవగాహన కార్యక్రమాలు

ప్రజాశక్తి-పార్వతీపురం

కుష్టు వ్యాధిగ్రస్తుల గుర్తింపుపై ఈ నెల 20 నుంచి ఫిబ్రవరి రెండో తేది వరకు 14 రోజులపాటు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. శరీరంపై స్పర్శ లేని మచ్చలు, చర్మంపై రాగి రంగు మచ్చలు, లావుగా మారిన, నొప్పితో కూడిన నరాలు, కాళ్లు, చేతి కండరాలలో బలహీనత ఉన్నా, చేతులు, పాదాల నరాల్లో తిమ్మిర్లు తదితర లక్షణాలున్న వారు పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంపై డ్వాక్రా, మెప్మా, అంగన్వాడీల ద్వారా ప్రచారం చేయాలని చెప్పారు. ఈ అవగాహన కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొని జయప్రదం చేయాలని ఆయన స్పష్టంచేశారు. ప్రతి ఇంటినీ ఎఎన్ఎం, వాలంటీర్స్ సందర్శించాలని, అందుకు కార్యాచరణ ప్రణాళిక అమలు చేయాలని సూచించారు. జిల్లాలో కుష్టు వ్యాధిపై ఉన్న అపోహల గురించి ప్రజలకు అవగాహన కల్పించి, వ్యాధి సోకిన ప్రతి వ్యక్తినీ గుర్తించి చికిత్స అందించాలని ఆదేశించారు. 14 రోజుల పాటు వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, సిబ్బంది ప్రతి ఇంటింటికి వెళ్లి సర్వే చేపట్టాలని తెలిపారు. సర్వేలో కుష్టువ్యాధి లక్షణాలు ఉన్న వారిని గుర్తించి వైద్య సౌకర్యాలు అందించాలని ఆదేశించారు. కుష్టు వ్యాధి లక్షణాలను ప్రాథమిక దశలోనే గుర్తించి వైద్య సేవలు అందించడం వల్ల ఆరు మాసాలలో పూర్తిగా నయం అవుతుందని తెలిపారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

పాఠశాలల్లో పిల్లలకు వైద్య పరీక్షలు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. సంక్షేమ శాఖల వసతిగృహాల్లో ఉన్న విద్యార్థులకు వైద్య పరీక్షలు చేయాలని పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని గ్రామాలలో కుష్టు వ్యాధి లక్షణాలు ఉన్నవారిని గుర్తించే కార్యక్రమంపై విస్తృతంగా ప్రచారం చేయాలని అధికారులను ఆదేశించారు. ఎఎన్ఎం, ఆశా వర్కర్ల బృందంతో డోర్ టు డోర్ సర్వే, సర్వేను పర్యవేక్షించే మండల స్థాయి వైద్య అధికారి, క్లస్టర్ స్థాయి సిహెచ్ఒ సర్వే ప్రక్రియను పర్యవేక్షించాలని ఆయన ఆదేశించారు. జిల్లాలో కుష్టు వ్యాధి కేసులు నమోదు అయితే వాటికి కారణాలు సమర్పించాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. కుష్టు వ్యాధి కేసుల డేటాను ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ఉపకేంద్రాల వారీగా సమర్పించాలని చెప్పారు. కుష్టు వ్యాధి వ్యాప్తిని ఆపడానికి కుటుంబ సభ్యులు చేయాల్సిన, చేయకూడని వాటి జాబితాను అందజేసి, సూచనలు చేయాలని సూచించారు.


భోగి మంటల్లో సమస్యల పత్రాన్ని వేస్తున్న కాంగ్రెస్ నాయకులు

భోగి మంటలతో సమస్యలు దహనమవ్వాలి

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

భోగి మంటలతో సమస్యలు దహనమవ్వాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి బత్తిన మోహన్‌రావు అన్నారు. సోమవారం పట్టణ ప్రధాన రహదారిలో వేసిన భోగిమంటల్లో ఆ పార్టీ నాయకులు వంగల దాలినాయుడు, కోలా కిరణ్, సాయి శివ తదితరులతో కలిసి పార్వతీపురాన్ని వేధిస్తున్న సమస్యల వినతి పత్రాన్ని దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్వతీపురాన్ని పలు సమస్యలు వేధిస్తున్నాయన్నారు. ఈ భోగి మంటలతో అవి దహనమయ్యేలా పాలకులు, అధికారులు చర్యలు చేపట్టాలని కోరారు. తాగునీటి సమస్యను పరిష్కరించి ప్రతిరోజూ నీరు ఇవ్వాలన్నారు. చెత్త డంపింగ్ యార్డు తరలించాలన్నారు. గోతులు పూడ్చాలని, కొత్త రోడ్ల నిర్మాణం చేపట్టాలని కోరారు. సీతానగరం చక్కెర ఫ్యాక్టరీని తెరిపించాలన్నారు. కబ్జాకు గురైన చెరువులు, వరహాల గెడ్డ ప్రభుత్వ భూములను రక్షించాలని డిమాండ్ చేశారు.

క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వాలి

ప్రజాశక్తి-సాలూరు రూరల్

క్రీడలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రాధాన్యత ఇవ్వాలని పట్టణ పౌర సంక్షేమ సంఘం కార్యదర్శి ఎన్ వై నాయుడు కోరారు. సంక్రాంతి సందర్భంగా ఆ సంఘం ఆధ్వర్యాన సాలూరులోని 7, 8వ వార్డుల్లో మహిళలకు ఆటల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కులమతాల తేడా లేకుండా అందరూ కలిసి మెలిసి పండుగలను నిర్వహించుకోవాలని తెలిపారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు తుపాకుల రాముడు, బోను ఈశ్వరరావు, బంగారు సంగీత, బంగారు విశాలాక్షి, టి భాస్కర్ రావు తదితరులు పాల్గొన్నారు.


ఆటల పోటీల్లో విజేతలతో నాయకులు

మార్కెట్ కళకళ


జనాలతో నిండిన రహదారి

ప్రజాశక్తి-వీరఘట్టం

సంక్రాంతి సందర్భంగా మండలంలో సందడి నెలకొంది. మండల నలుమూలల నుంచి ప్రజలు వీరఘట్టం చేరుకోవడంతో మార్కెట్ కళకళలాడింది. బట్టల షాపులు, కిరాణా, కూరగాయల షాపులు జనాలతో కిటకిటలాడాయి. అధిక సంఖ్యలో జనాలు చేరుకోవడంతో ప్రధాన రహదారిలో ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. ఈ కారణంగా వాహనదారులు రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బంది ఎదుర్కొన్నారు.


వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న సర్పంచ్ వెంకటరత్నం

ఆర్ఒ వాటర్ ప్లాంట్ ఏర్పాటు

ప్రజాశక్తి-మక్కువ

మండలంలోని వెంకటభైరిపురం గ్రామంలో ఎంఎస్ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు మరడ శ్రీనివాసరావు ఆర్ఒ వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటుచేశారు. సోమవారం ఈ ప్లాంట్‌ను సర్పంచ్ మరడ వెంకటరత్నం ప్రారంభించారు. ఈ సందర్భంగా మరడ శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రజలు రోగాల బారిన పడకుండా ఉండేందుకు ఆర్ఒ ప్లాంట్ ద్వారా ఉచితంగా తాగునీరు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో యువసేన సభ్యులు పాల్గొన్నారు.

అభివృద్ధిపై కలెక్టర్‌తో ఎమ్మెల్యే చర్చ

ప్రజాశక్తి- శృంగవరపుకోట

నియోజకవర్గం అభివృద్ధిపై ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్‌తో చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ఆమె కలెక్టర్‌ను కలిసి మాట్లాడారు. అనంతరం ఆమె మాట్లాడుతూ నియోజకవర్గంలో ఈ నెల 17 కలెక్టర్ పర్యటించనున్నారని అన్నారు. ఎస్‌కోటలోని రేగ పుణ్యగిరి, ఇతర గిరిజనుల ప్రాంతాల్లోని గిరిజనుల డోలీ సమస్యలను పరిష్కరించాలని గత అసెంబ్లీ సమావేశాలలో డోలి మోతల సమస్యల గురించి అసెంబ్లీలో లేవనెత్తిన విషయం కలెక్టర్‌కి చెప్పామన్నారు. ఉపాధి హామీ నిధులను కేటాయించి డోలి మోత సమస్యలను త్వరగా పరిష్కారించాలని కోరామన్నారు. కలెక్టర్ సమస్యలన్నీ విని సానుకూలంగా స్పందించి ఈ నెల 17 నియోజకవర్గంలో పర్యటిస్తామన్నారని చెప్పారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో చింతలపాలెం సర్పంచ్ మాకేన నవీన్ పాత్రుడు ఉన్నారు.

16న అప్రెంటీస్ మేళా

ప్రజాశక్తి-విజయనగరంకోట

జిల్లా కేంద్రంలోని విటి అగ్రహారంలోగల ప్రభుత్వ ఐటిఐలో ఈనెల 16న ఉదయం 9గంటల నుంచి ప్రధానమంత్రి నేషనల్ అప్రెంటిస్ షిప్ మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ టివి గిరి తెలిపారు. ఐటిఐ పాసైన వారంతా ఈ మేళాలో పాల్గొనవచ్చునని తెలిపారు. వరుణ్ మోటార్స్ ప్రైవేటు లిమిటెడ్, జయభేరి ఆటోమోటివ్ లిమిటెడ్, ఇన్నోవా సోర్స్, క్యూసివ్ టెక్నాలజి ప్రైవేట్ లిమిటెడ్, భగవతి ప్రొడక్షన్ ప్రైవేటు లిమిటెడ్, ఆర్‌వి మోటార్స్, జెవై సొల్యూషన్, డెక్కన్ ఫెర్రో ఎల్లాయిస్, హెట్రో డ్రగ్స్ నక్కపల్లి, కళ ఫుడ్ ప్రొడక్ట్ లిమిటెడ్ తదితర కంపెనీలను ఆహ్వానించినట్లు తెలిపారు. ఎంపికైన వారికి ఆయా పరిశ్రమల్లో ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు తగిన స్టయిఫండ్ చెల్లించనున్నట్లు తెలిపారు. ఆసక్తిగల వారు బయోడేటా, ఒరిజినల్ సర్టిఫికెట్లు, ఆధార్‌కార్డు, 2ఫొటోలతో పాటు కావాలని తెలిపారు. వివరాలకు ఫోను నెంబర్లు 9849118075, 9849944654ను సంప్రదించాలని తెలిపారు.

పవన్‌ను కలిసిన భోగాపురం నాయకులు

ప్రజాశక్తి - భోగాపురం

డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్‌ను నియోజకవర్గ జనసేన నాయకులు మంగలగిరిలో కలిశారు. ఆ పార్టీ నాయకులు లోకం ప్రసాద్ ఆధ్వర్యంలో వీరంతా వెళ్లి ఆయన్ను కలిసి నామినేటెడ్ పోస్టులపై ఆరా తీశారు. ఈ నేపథ్యంలో పదవులు ఆశించే వారంతా వెళ్లి కలిసినట్లు తెలుస్తోంది. పవన్‌ను కలిసిన వారిలో సీనియర్ నాయకులు కాకర్లపూడి శ్రీనివాసరాజు, చనుమల్ల వెంకటరమణ, సర్పంచ్ మట్ట అయ్యప్ప రెడ్డి, కొవ్వాడ రఘు, చెల్లిబోయిన నర్సింగ్ రావు, బాల అప్పలరాజు, పల్లంట్ల జగదీష్ తదితరులు ఉన్నారు.

నేరాలు ఘోరాలు

503 మద్యం సీసాలు పట్టివేత

ప్రజాశక్తి-సీతంపేట

బొలెరో వాహనంలో గ్రామాల్లోకి తరలిస్తున్న 503 మద్యం బాటిళ్లను దోనుబాయి ఎస్ఐ షేక్ మస్తాన్ సోమవారం పట్టుకున్నారు. కొత్తకోట సమీపంలో మాటువేసి పట్టుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

16 మంది జూదగాళ్లు అరెస్టు

ప్రజాశక్తి- డెంకాడ

మండలంలోని గొలగాం, చొల్లంగిపేట గ్రామాల్లో 16 మంది జూదగాళ్లను ఆదివారం రాత్రి అరెస్టు చేసినట్లు ఎస్ఐ ఎ.సన్యాసినాయుడు తెలిపారు. గొలగాంలో పేకాటాడుతున్నట్లు సమాచారం రావడంతో తన సిబ్బందితో కలిసి దాడి చేసి ఏడుగురు వ్యక్తులను పట్టుకొని వారి వద్ద నుంచి రూ.15100 నగదు, మూడు ద్విచక్ర వాహనాలు సీజ్ చేశామన్నారు. చోల్లంగపేట గ్రామంలో రచ్చబండ వద్ద 9 మందిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.5250 స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వీరిపై కేసు నమోదు చేసి కోర్టుకు తరలించామని చెప్పారు.